సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 23 । జూన్ । 2024



వెంకన్న స్వామీ.. సదా స్మరామి


కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం భక్తజన సంద్రంగా మారింది. గోవింద నామస్మరణతో మార్మోగింది. - 8లో▸



పీచే కదా అనుకోవద్దు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 50కి పైగా కొబ్బరి పీచు పరిశ్రమల నుంచి నిత్యం పీచు, తాడు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. - 8లో▸

డెల్టాలకు 8,230 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,230 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,290, మధ్య డెల్టాకు 1,640, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.65 అడుగులకు చేరింది.

సీజనల్ యుద్ధం.. సర్వం సిద్ధం

- వ్యాధుల కట్టడికి అప్రమత్తత
- కలుషిత నీరు, నిల్వ ఆహారానికి దూరంగా ఉండాలని ప్రచారం
- ప్రత్యేక ప్రణాళిక అమలు దిశగా వివిధ శాఖల అధికారులు

అలమూరు/ అమలాపురం టౌన్: వ్యాధులు రావడానికి కారణాలెన్నో.. ఇందులో ప్రధానమైనవి సీజనల్‌గా వచ్చేవి. ఏదైనా సమస్య వచ్చాక ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీసే కన్నా, ముందస్తు జాగ్రత్తలే శ్రీరామరక్ష అని వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తోంది. వాతావరణంలో మార్పులు, తుపానుల ప్రభావంతో వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతో పాటు సురక్షిత తాగునీటిని తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయవచ్చు. జిల్లాలో మొత్తం 73 ప్రభుత్వ ఆసుపత్రులు ఉండగా.. ఇందులో 17 సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. గత ప్రభుత్వం అన్ని ఆసుపత్రుల్లో వైద్యారోగ్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించింది. ఇందులో భాగంగా ఆయా ప్రభుత్వ ఆసుపత్రులో 215 మంది వైద్యులు, 426 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 587 మంది ఏఎన్ఎంలు, 1,395 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు వైద్యాధికారులు సీజనల్ వ్యాధుల నివారణకు నడుం బిగించారు. ఇప్పటికే గ్రామాల్లో జ్వర పీడితుల వివరాలను సేకరించేందుకు వైద్యారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో అంటువ్యాధుల వ్యాప్తి–నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఏ వ్యాధులు సోకుతాయంటే..

- కోరింత దగ్గు చిన్న పిల్లల్లో శ్వాస మార్గాన్ని బాధించే అంటువ్యాధి. దీనివల్ల దగ్గు విపరీతంగా వస్తుంది. ఏడాది లోపు వయసు కలిగిన చిన్నారులకు వస్తే ప్రాణాప్రాయం సంభవించే అవకాశం ఉంది.
- డయేరియాతో నీళ్ల విరేచనాలు ఎక్కువగా అవుతాయి. కలుషిత నీరు తాగడం, నిల్వ పదార్థాలను భుజించడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది.
- చికన్ గున్యాతో అకస్మాత్తుగా జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి.
- డెంగీతో ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, తీవ్రంగా జ్వరం, హఠాత్తుగా శరీరంపై పొక్కులు రావడం, మలవిసర్జనలో రక్తం పడటం జరుగుతుంది.
- పచ్చకామెర్లు ప్రధానంగా కలుషిత నీరు తాగడం సోకుతుంది. శరీరం అంతా పచ్చగా మారుతుంది. అశ్రద్ధ చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.
- ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమ కుట్టడంతో వస్తుంది. మురుగు కుంటల్లో ఈ దోమలు వ్యాప్తి చెందుతాయి. ఆ రోగిని కుట్టిన దోమ మరో వ్యక్తిని కుడితే ఈ వ్యాధి ప్రబలుతుంది.
- మెదడువాపు సోకితే కళ్లను అసాధారణంగా తిప్పడం, అపస్మారక స్థితికి వెళ్లిపోవడం, తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. పెద్ద శబ్దాలు భరించలేని పరిస్థితి ఉంటుంది. నిద్రమత్తు ఎక్కువవుతుంది.
- ఆటలమ్మ లేదా అమ్మవారు అంటువ్యాధి. వారిసెల్లా జోస్టర్ వైరస్ ద్వారా సోకుతుంది. తీవ్రమైన జ్వరం వచ్చి వెన్నెముక చుట్టూ ఉన్న జీవకణాల్ని బాధిస్తుంది.



పెదపళ్లలో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ప్రత్యేక దృష్టిపెట్టి..

జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ యుద్ధం ప్రకటించింది. ముఖ్యంగా 0–5 ఏళ్లలోపు ఉన్న 1.19 లక్షల పిల్లలు డయేరియా బారిన పడకుండా ప్రత్యేక దృష్టి పెట్టింది. దీని కోసం జూలై 1వ తేదీ నుంచి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనుంది. దీనిపై శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులను సమర్థంగా ఎదుర్కొనేందుకు దిశానిర్దేశం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర ఆధ్వర్యంలో 30వ తేదీ లోపు ఉమ్మడి ప్రణాళిక సిద్ధమయ్యేలా రూపకల్పన చేశారు. వైద్య, ఆరోగ్య శాఖతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలను సమన్వయ పరిచి ఈ ప్రణాళిక సిద్ధం కానుంది. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించే పంచాయతీలను కూడా భాగస్వామ్యం చేశారు. మహిళలు, పిల్లల ఆరోగ్య భద్రతను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చూసుకోనుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను మరింత ముమ్మరం చేసేందుకు ఆ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రస్తుతం జిల్లాలో సాధారణ వైరల్ జ్వరాల బాధితులు ప్రభుత్వ ఆసుపత్రులకే కాకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పదుల సంఖ్యలో వెళుతున్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోజూ వచ్చే 400 నుంచి 500 అవుట్ పేషెంట్లలో 40 నుంచి 50 మంది వరకూ సీజనల్ వ్యాధుల బాధితులే ఉంటున్నారు.



సీజనల్ వ్యాధుల నివారణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

ఒకటి నుంచి డయేరియాపై ప్రచారం

జిల్లాలో జూలై 1 నుంచి 31వ తేదీ వరకూ వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా నివారణకు 15 రోజులు ప్రచారం నిర్వహించనున్నారు. ఆ నెల రోజులూ 0–5 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి డయేరియా సోకితే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఆ ఇంట్లో రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు టాబ్లెట్స్ ఇస్తారు. ఈలోగా అంగన్‌వాడీ వర్కర్లు చిన్న పిల్లల్లో ఎదుగుదల, పౌష్టికాహార పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ శుక్లా ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీని ఆదేశించారు.

ఏడాదిలో 358 కేసులు

గత సంవత్సరం జూలై 23వ తేదీ నుంచి ప్రస్తుత జూలై మొదటి వారం వరకూ జిల్లాలో 0–5 ఏళ్లలోపు 358 మంది పిల్లలకు డయేరియా సోకినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణంకాలు చెబుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఉప్పలగుప్తం మండలంలో 30 కేసులు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో 192 ఫీవర్ కేసులను గుర్తించారు.

నీటి కాలుష్యం లేకుండా..

తాగునీటి కాలుష్యంతో డయేరియా సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సీపీడబ్ల్యూఎస్, పీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు సరిగా పనిచేయకపోవడం, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను సరిగా పరిశుభ్రం చేయకపోవడం, వాటర్ క్లోరినేషన్ లేకపోవడం, తాగునీరు పైపులైన్ల లీకేజీలతో డయేరియా తదితర సీజనల్ వ్యాధులు వచ్చే వీలుంటుంది. ఈ సమస్యలన్నీ అధిగమించేందుకు జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మున్సిపాలిటీ శాఖలు సమన్వయంతో పనిచేసి ఆ లోపాలను సరిచేయాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చు. తద్వారా సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా, చికన్ గున్యా, మెదడువాపు తదితర వాటిని దూరం చేయవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీనికిగాను ఇంట్లో వ్యర్థాలు, రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కుండీల్లో నిల్వ నీరు లేకుండా చూసుకుంటే దోమలు వృద్ధి చెందవు.

వెంటనే వైద్యులను సంప్రదించండి



ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. శరీరంలో ఏవిధమైన మార్పులు సంభవించినా సత్వరమే వైద్యులను సంప్రదించాలి. వైద్య సలహాలు పాటించి చికిత్స చేయించుకోవాలి. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

– ఎం.సుమలత, కొత్తపేట డివిజన్ వైద్యాధికారి

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని తొలగించడం అప్రజాస్వామికం



సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: తాడేపల్లి పరిధిలో నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ భవనాన్ని తొలగించడం అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మండిపడ్డారు. శనివారం ఆయన అమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఆ భవన తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలోని టీడీపీ కనుసన్నల్లో ఇది జరిగిందన్నారు. శని, ఆదివారాల్లో హైకోర్టు సెలవు సమయం చూసుకుని ఇటువంటి దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. ఇలాంటి దౌర్జన్యాలను ప్రభుత్వం నిలిపివేయాలని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు.

కూల్చడం అన్యాయం



బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయ భవనాన్ని తొలగించడం అన్యాయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఖండించారు. అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని కూల్చివేయాలన్న సీఆర్‌డీఏ ప్రిలిమినరీ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ వైఎస్సార్ సీపీ హైకోర్టును ఆశ్రయించినప్పుడు చట్టాన్ని మీరి వ్యవహరించవద్దని కోర్టు సూచించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు ఇలా చేయడం వెనుక కేవలం చంద్రబాబు పన్నిన కుట్ర ఉందని ఎమ్మెల్సీ అన్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చివేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరు తేటతెల్లమవుతోందన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, తొందరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం ఈపురుపల్లిలో ఓ యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను ఎమ్మెల్సీ ఖండించారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి బాధితురాలి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాలాజీ క్షేత్రం.. భక్తజన సంద్రం

మామిడికుదురు: గోవిందా హరి గోవిందా అంటూ అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని శనివారం భక్తులు దర్శించుకుని తన్మయత్వం పొందారు. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తమ కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీబాల బాలాజీ స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్శనభాగ్యం కల్పించారు. ఆలయానికి లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,30,615 ఆదాయం సమకూరింది. ఇందులో నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.68,548 విరాళాలుగా అందించారని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. అలాగే వివిధ సేవల ద్వారా రూ.2,99,163, ఆదాయం లభించిందన్నారు. స్వామి వారిని 3,271 మంది భక్తులు దర్శించుకోగా 2,084 మంది అన్నప్రసాదం స్వీకరించారని చెప్పారు.

రేపటి నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

అమలాపురం రూరల్: కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూల్లో సీట్లు రాని అభ్యర్థులకు జనరల్ పూల్ ద్వారా ఈ నెల 24, 25వ తేదీల్లో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఎంవీజీ వర్మ శనివారం తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం

అమలాపురం రూరల్: సమనస గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీలోగా సమనస గురుకుల పాఠశాలలో విద్యార్థులు తమ ఆధార్ కార్డులను సమర్పించాలన్నారు. లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి..

అల్లవరం: గోడిలోని బాలికల గురుకులంలో 6 నుంచి 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25న గురుకుల ఆవరణలోనే విద్యార్థినుల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ కిరణ్మయి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95732 93427, 93461 47892 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

శనైశ్చరునికి ప్రత్యేక తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేశారు. శనికి ప్రీతికరమైన శనివారం సందర్భంగా దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తు ల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానాని కి రూ.1,66,000, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.45,210 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలకు అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు.

తోటివారికి సాయపడితేనే జీవితానికి సార్థకత

మండపేట: జీవితంలో ఎంత సంపాదించినా చివరికి మిగిలేది బూడిదని, దీనిని దృష్టిలో పెట్టుకొని తోటి వారికి సాయపడే తత్వాన్ని అలవర్చుకోవాలని మహా సహస్రావధాని, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. మండపేట ధర్మగుండం చెరువుగట్టు వద్ద ఉన్న శ్రీసీతారామ కల్యాణ మండపంలో రెండో రోజు శనివారం రాత్రి శివతత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కాశీ పురాణంలోని కొన్ని ఘట్టాలను ఆయన వివరించి.. జీవితంలో ప్రతి ఒక్కరూ సాటివారి పట్ల దయ, దాన గుణాలను కలిగి ఉండాలని తెలిపారు. మనం చేసిన మంచే చివరికి మిగులుతుందని ఉద్బోధించారు. బంధాలకన్నా భగవంతుడిని సేవలో అధిక సమయం గడపాలన్నారు. అంతకు ముందు బీజేపీ నాయకుడు వల్లూరి విజయానంద పార్థసారథి కాశీ నుంచి తీసుకువచ్చిన ఆవు దూడ విగ్రహాన్ని నరసింహారావుకు బహూకరించారు. మండపేట పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అశేషంగా తరలివచ్చి ప్రవచనాలను ఆలకించారు. భక్తులకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



శివతత్వం గురించి ప్రవచిస్తున్న నరసింహారావు

1.68 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యం

అల్లవరం: ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 1,68,780 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. అల్లవరం మండలం కోడూరుపాడులో వరి నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ ఈ నెలఖారుకు నారుమడులు సిద్ధం చేసుకోవాలని, ఆలస్యం చేస్తే రెండో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలను తట్టుకునేలా ఎంటీయూ 1,318, ఎంటీయూ 1,064 రకాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,836 ఎకరాల్లో నారుమళ్లు పూర్తి కాగా, 593 ఎకరాల్లో వెదజల్లు, 30 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారని అన్నారు. ఖరీఫ్ పంట కాలానికి 43,642 టన్నుల ఎరువులను ప్రైవేటు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. అల్లవరం మండలంలో 50 ఎకరాల్లో నారుమళ్లు సిద్ధం చేశారన్నారు. రైతులు మాత్రం వరినాట్లు వేయడంలో ఆలస్యం చేయరాదని సూచించారు. వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, ఏఈఓ శివమోహన్, ఏఏఓ శ్రావణి, రైతులు పాటి సింహాద్రి, జల్లి అన్నవరం, పాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కోడూరుపాడులో నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

ప్రైవేటు వల

- ఇంజినీరింగ్ విద్యార్థులపై కళాశాలల బేరసారాలు
- కౌన్సెలింగ్‌కు ముందే సీట్లు బుక్ చేసుకోవాలని ఫోన్లు
- అప్పుడే సీట్లు భర్తీ అయిపోయాయంటూ ఒత్తిళ్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఈఏపీ) సెట్ ఫలితాలు మొన్నమొన్ననే విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లకు ఇంకా నోటిఫికేషన్ విడుదల కాలేదు. రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు త్వరలో నోటిఫికేషన్ విడుదలవుతుందని అధికారులు చెబుతున్నారు. ఏ కళాశాల మంచిది.. ఏ బ్రాంచి అయితే మంచి ఉద్యోగాలు లభిస్తాయి, క్యాంపస్ సెలక్షన్లకు ఎక్కడ ఎక్కువగా అవకాశాలున్నాయి తదితర అంశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆలోచనలు సాగిస్తున్నారు. ఈ విషయంపై బంధుమిత్రులతో చర్చోపచర్చలు సాగిస్తున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో ఇంజినీరింగ్ చదవడం ద్వారా బంగారు భవిష్యత్తు పొందాలని కలలు కంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ప్రైవేటు కళాశాలలు వల విసురుతున్నాయి. అడ్మిషన్ల నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతూండటంతో స్పీడ్ పెంచాయి. తమ కళాశాలల్లో చేరాలని, ఇప్పటికే కీలకమైన బ్రాంచిల్లో సీట్లు భర్తీ అయిపోయాయంటూ సిబ్బంది ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఆలసించిన ఆశాభంగమంటూ హడావుడి చేస్తున్నారు. త్వరపడకపోతే మంచి బ్రాంచిల్లో సీట్లు దొరకవని నేరుగా ఫోన్లు చేస్తూ, బేరసారాలు సాగిస్తున్నారు. దీంతో, ఇటు విద్యార్థులు, అటు వారి తల్లిదండ్రులు కంగారు పడుతున్నారు. ఆలస్యం చేస్తే కోరుకున్న కళాశాలలో, డిమాండ్ ఉన్న బ్రాంచిలో సీటు దొరకదేమోనని కలవరపడుతున్నారు. కాస్త పేరున్న కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచిలలో చాలా వరకూ సీట్లు ఇప్పటికే భర్తీ అయిపోయాయని తెలుస్తోంది. కావాల్సిన కళాశాలల్లో సీట్లు పొందడానికి తమ బిడ్డలకు సిఫారసులు సైతం చేసుకునే పనిలో విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

ప్రతి విద్యార్థికీ అవకాశం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రెండు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో 950 సీట్లు ఉన్నాయి. వీటితో పాటు 27 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 14,500 సీట్లు ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో కాకినాడ జిల్లాలో 6,495 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,330 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 5,425 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 14,250 మంది ఉత్తీర్ణులయ్యారు. దీనిని బట్టి కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ఏదో ఒక కళాశాలలో అడ్మిషన్ లభించనుంది.


సీట్లు దొరకవనే ప్రచారం

పరిస్థితి ఇలా ఉండగా ఆలస్యం చేస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరకకపోవచ్చంటూ కొన్ని ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. ఎంసెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వేచి చూస్తే తమ బిడ్డలకు నష్టం జరుగుతుందేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సీటు విషయమై ముందుగానే ఒక నిర్ణయానికి రావాలని, కొంత అడ్వాన్స్ ముట్టజెప్పి, సీటు రిజర్వ్ చేసుకోవాలని ఆయా కళాశాలలు ఒత్తిళ్లు తెస్తున్నాయి. మంచి కళాశాలలో సీట్లు దొరకవనే ప్రచారంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ర్యాంకులతో సంబంధం లేకుండా సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ.. ఇలా పలు విధాలుగా సీట్లు భర్తీ చేసుకుంటున్నారు.

గడచిన ఐదేళ్లుగా అంతర్జాతీయంగా ఐటీకి విపరీతమైన డిమాండ్ వచ్చింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కొలువులకు భారీగా ఆఫర్లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో సీఎస్ఈ, దానికి అనుబంధంగా ఉండే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర బ్రాంచిలకు చాలా వరకూ డిమాండ్ ఏర్పడింది. కాకినాడ జిల్లాలో బాగా పేరొందిన ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ సీటుకు రూ.10 లక్షల వరకూ డొనేషన్ ఇవ్వడానికి వెనుకాడటం లేదంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక మోస్తరు కళాశాల అయితే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఇస్తామని, సీటు రిజర్వ్ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కౌన్సెలింగ్ ప్రారంభమైనా కోరుకున్న కళాశాలలో సీటు రాకపోతే అప్పుడు బాధ పడి ప్రయోజనం ఉండదని, ముందుగానే యాజమాన్యాలతో మాట్లాడుకుని, ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దానిని మేనేజ్‌మెంట్ కోటా లేదా ఎన్ఆర్ఐ కోటాకు మార్చుకునే అవకాశం కల్పిస్తామని చెప్పి ప్రైవేటు కళాశాలలు సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి.



కన్వీనర్ కోటాకే ప్రభుత్వ పథకాలు



కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. బీటెక్‌లో అన్ని బ్రాంచిలూ ముఖ్యమైనవే. విద్యార్థుల ఇష్టం మేరకూ ఎంచుకుని, కన్వీనర్ కోటాలో చేరవచ్చు. జేఎన్‌టీయూకే పరిధిలోని 160 కళాశాలల్లో దాదాపు 25 వేల నుంచి 30 వేల సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. ఏపీ ఈఏపీ సెట్ ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థీ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలి.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఎంసెట్ చైర్మన్, ఉప కులపతి, జేఎన్‌టీయూ–కాకినాడ

అవగాహన పెంచుకోవాలి



ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు తాము చదవాలనుకున్న కోర్సులు, వాటికి లభిస్తున్న ఉపాధి అవకాశాలు, పరిశోధనలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలి. అలాగే అభిరుచి, ఆసక్తి ఉన్న కోర్సు ఎంపిక చేసుకోవడం ఉత్తమం. గణితంపై ఆసక్తి ఉన్నవారు ఈసీఈ, ఈఈఈ, సివిల్ డ్రాయింగ్‌పై ఆసక్తి ఉన్నవారు సివిల్ కోర్సులను ఎంపిక చేసుకోవాలి.

– ఎ.గోపాలకృష్ణ, ప్రొఫెసర్, మెకానికల్, జేఎన్‌టీయూకే

శ్రద్ధాంజలి



శ్రీ విప్పర్తి చిట్టి రామారావు గారు
ది. 13-06-2024 గురువారం రాత్రి స్వర్గస్తులైనారు.
ది. 23-06-2024 ఆదివారం పెద్దకార్యం మా స్వగృహము నందు మెయిన్‌రోడ్ ధవళేశ్వరంలో జరుగును కావున తెలియజేయడమైనది
కీ. శే. శ్రీ విప్పర్తి చిట్టి రామారావు గారు
ఇట్లు.. విప్పర్తి వేణుగోపాలరావు
జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్, తూ.గో.జిల్లా
మరియు కుటుంబసభ్యులు

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి మున్సిపల్ ఉద్యోగి మృతి


నరసింహం (ఫైల్)

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయ వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్న ఓ ఉద్యోగి విద్యుదాఘాతానికి మృతి చెందాడు. ఎస్సై మూర్తి కథనం ప్రకారం.. శనివారం ఉదయం స్థానిక భీమవరపుపేటకు చెందిన మున్సిపల్ ఉద్యోగి కింతాడ నరసింహం (32) ఇంట్లో ఉన్న టీవీ రావడం లేదని విద్యుత్తు తీగలను చూస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

ఐ.పోలవరం: పాతయింజరం వద్ద పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఐ.పోలవరం ఎస్సై జె.భానుప్రసాద్ తెలిపారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు ఒంటిపై లేతనీలం రంగు చొక్కా, వంగపువ్వు రంగు ప్యాంట్ ఉన్నాయి. మరిన్ని వివరాలకు 94407 96540 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఎస్సై అన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి మహిళ మృతి


కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద మృతి చెందిన మహిళ

కొవ్వూరు: గోదావరిలో స్నానానికి దిగి ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు కథనం ప్రకారం.. స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద స్నానానికి దిగి మునిగిపోతున్న ఓ మహిళను గుర్తించి స్థానికులు బయటకు తీసుకువచ్చారు. అయితే ఆమె అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి వయసు సుమారు అరవై ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆమె వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పీచే కదా అనుకోవద్దు

- కోనసీమలో కొబ్బరి పీచు, తాడుకు డిమాండ్
- ఇతర ప్రాంతాలకు జోరుగా ఎగుమతులు
- లాభాలు కురిపిస్తున్న వ్యాపారం


తూర్పుపాలెం నుంచి ఇతర రాష్ట్రాలకు లారీలో ఎగుమతి చేస్తున్న పీచుబేళ్లు

మలికిపురం: కోనసీమ.. ఈ పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది కొబ్బరి చెట్లే. అలాంటి కొబ్బరి నుంచి వచ్చే ఉత్పత్తులైన పీచు, తాడుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి పీచు పరిశ్రమల నుంచి వీటిని నిత్యం ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా కొబ్బరి పీచు ఉత్పత్తులు ముంబయి, హైదరాబాద్, ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు వంటి రాష్ట్రాలకు పంపిస్తున్నారు. గతంలో చైనాకు అధికంగా ఎగుమతి జరిగేది. అక్కడ పరుపుల తయారీలో పీచును అధికంగా వినియోగించేవారు. అయితే పరుపుల తయారీకి ప్రత్యామ్నాయం రావడంతో పీచు వినియోగం అక్కడ తగ్గింది. పీచుతో పాటు పీచు ద్వారా తాడు ఉత్పత్తులు మాత్రం దేశంలో ఇతర ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొబ్బరి పీచు, తాడు ఉత్పత్తులు ఎంతో లాభదాయకంగా మారాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో సుమారు 50కు పైగా కొబ్బరి పీచు ఉత్పత్తుల పరిశ్రమలు ఉన్నాయి. కేశనపల్లి, తూర్పుపాలెం, పాశర్లపూడి, అంబాజీపేట తదితర ప్రాంతాల్లో పీచు పరిశ్రమల ద్వారా రోజు సుమారు 100 టన్నుల పీచు ఉత్పత్తులు జరుగుతున్నాయి. గతంలో కొబ్బరి పీచు రెండు గ్రేడులలో తయారయ్యేది. కర్లింగ్ పీచు ఉత్పత్తి మరొకటి. కొబ్బరి ఉత్పత్తులకు ముడి సరుకు కొబ్బరి డొక్క. ఇది ఈ ప్రాంతాల్లో విరివిగా లభిస్తుంది. పరిశ్రమల నిర్వాహకులు తమకు అవసరమైన డొక్కలను రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. వాటిని పెద్ద లాట్లుగా కట్టి పది, పదిహేను రోజులు నీటితో తడుపుతారు. ఆ తర్వాత డీసెండికేటర్‌లో కొబ్బరి డొక్కలు ఆడతారు. తయారైన పీచును ఎండబెట్టి ఎగుమతులకు సిద్ధం చేస్తారు. ప్రత్యేక మెషీన్లతో కర్లింగ్ పీచు తయారు చేస్తారు. అలాగే కొబ్బరి తాడు తయారీ పరిశ్రమల నిర్వాహకులు పీచు ఉత్పత్తిదారుల నుంచి కర్లింగ్ పీచు కొనుగోలు చేసుకుని దీనిని కర్లింగ్ మెషీన్ల ద్వారా రెండు రకాల తాడు తయారీ చేస్తారు. ప్రస్తుతం ఒకే గ్రేడు పీచు ధర టన్ను రూ.8 వేలు ఉంది. కర్లింగ్ పీచుకు రూ.10,500 ధర లభిస్తోంది. 2014 వరకూ కొబ్బరి పీచు చైనాకు ఎగుమతి అధికంగా జరిగేది. అయితే పరుపుల తయారీకి ఫోమ్ అందుబాటులోకి రావడంతో కొబ్బరి పీచుకు డిమాండ్ తగ్గింది. దేశీయంగా మాత్రం వినియోగం పెరిగింది. వచ్చే సెప్టెంబర్‌లో జరుగనున్న వినాయక చవితి ఉత్సవాల్లో వినాయక విగ్రహాల తయారీకి దేశ వ్యాప్తంగా కొబ్బరి పీచునే వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరుగుతోంది.


పొట్టుతో కంపోస్టు తయారు చేస్తున్న సిబ్బంది

బోట్ల తయారీకి ఇదే..

ప్రధానంగా బోట్ల తయారీలో కొబ్బరి పీచు వినియోగిస్తారు. ప్లాస్టిక్, కొబ్బరి పీచు వినియోగించి బోట్లను రూపొందిస్తారు. కాకినాడ, విశాఖపట్నం, ముంబయి, కోల్‌కతా, కేరళ, చెన్నై తదితర ప్రాంతాల్లోని చేపల బోట్లతో పాటు ఇతర రవాణా, టూరిజం బోట్ల తయారీలో ఈ కొబ్బరి పీచు వినియోగిస్తారు. కొబ్బరి పీచు తయారీలో పొట్టు కూడా వస్తుంది. దీనిని కంపోస్టు తయారీలో వినియోగిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీల వద్దే నేరుగా కంపోస్టు తయారు చేసి నర్సరీలకు ఎగుమతి చేస్తున్నారు. కడియంతో పాటు జిల్లాలో పలుచోట్ల ఉన్న కొబ్బరి, మామిడి, పూల మొక్కల నర్సరీలకు ఈ కంపోస్టు ఎగుమతి అవుతోంది. కంపోస్టు టన్నుకు రూ.3 వేల ధర లభిస్తుంది.

ఇటు బట్టీలకు..

కొబ్బరి పీచు తయారీ అనంతరం మిగిలే పొట్టును ఇటుక బట్టీల్లో కూడా వినియోగిస్తున్నారు. ఈ పొట్టు వినియోగం వల్ల ఇటుక తేలికగా ఉంటుంది. ఈ ఇటుక అపార్ట్‌మెంట్ నిర్మాణంలో బాగా ఉపయోగకారి. ఇలా కొబ్బరి పొట్టుకు, కంపోస్టు ఎగుమతులు రోజుకు 10 టన్నుల మేర జరుగుతున్నట్లు అంచనా. బట్టీలకు వెళ్లే కొబ్బరి పొట్టు ట్రాక్టర్ లోడుకు రూ.7 వేల ధర లభిస్తుంది.

దేశీయ అవసరాలే అధికం



గతంలో చైనాలో పరుపుల తయారీకి అధికంగా పీచు ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం పరుపులకు ప్రత్యామ్నాయం రావడంతో అక్కడికి ఎగుమతులు తగ్గాయి. దేశీయంగా బోట్లు, వినాయక విగ్రహాల తయారీకి అధికంగా వినియోగిస్తున్నారు. ప్రభుత్వం సహకరిస్తే విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి.

–మంచికంటి చంటి, పీచు పరిశ్రమ నిర్వాహకుడు, తూర్పుపాలెం

నేడు అంతర్జాతీయ వాకర్స్ కౌన్సిల్ సదస్సు

నాలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధుల రాక

అమలాపురం టౌన్: అంతర్జాతీయ వాకర్స్ 158వ కౌన్సిల్ సదస్సుకు అమలాపురం వేదిక అవుతోంది. ఇక్కడి వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లోని శ్రీకళా గ్రాండ్‌లో ఈ సదస్సు ఆదివారం జరగనుంది. ఈ విషయాన్ని స్థానిక వాకర్స్ హెల్త్ క్లబ్ శనివారం వెల్లడించింది. దీనికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది వాకర్స్ ప్రతినిధులు హాజరు కానున్నారు. తమ క్లబ్ కార్యవర్గ పదవీకాలంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశం రావడం జిల్లాలోని ప్రతినిధులకు సరికొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ వాకర్స్ సంస్థకు దేశంలో ఏదో ప్రాంతంలో ప్రతి మూడు నెలలకోసారి కౌన్సిల్ సమావేశం జరగడం సంప్రదాయంగా వస్తోంది. 12 ఏళ్ల కిందట అమలాపురంలో 99వ సదస్సు నిర్వహించుకుంటే, ఇప్పుడు 158వ సదస్సు జరుపుకొంటున్నామని అమలాపురానికి చెందిన సీనియర్ వాకర్ ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని క్లబ్‌ల పని తీరు, జిల్లా, ఏరియా (ప్రాంతీయ)ల వారీగా క్లబ్‌లు ఎలా మెరుగైన ఆలోచన్లు, విధానాలతో ముందుకు సాగాలనే అంశాలపై ఈ సదస్సు జరుగుతుందని అంతర్జాతీయ వాకర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ వివరించారు. ఈ సదస్సు ఏర్పాట్లను పట్టణానికి చెందిన సీనియర్ ప్రతినిధులు తేతల సత్యనారాయణ రెడ్డి, సప్పా నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

వెంకన్న స్వామీ.. సదా స్మరామి

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం
- ఒక్కరోజే ఆలయానికి రూ.40.37 లక్షల ఆదాయం


ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆత్రేయపురం: వెంకన్న స్వామీ.. సదా స్మరామి అంటూ వాడపల్లి స్వామిని భక్తులు మనసారా కొలిచారు.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఈ క్షేత్రం శనివారం కావడంతో భక్తజన సంద్రంగా మారింది. గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయమే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో అధికంగా ఏడువారాల నోము ఆచరిస్తున్న వారున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక దర్శనాలు, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదాల విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.40,37,620 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద అన్న సమారాధనలో వేలాది మంది పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాళ్లపూడి: ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై టి.శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన ఆచంట వీరాస్వామి (26)కు వేగేశ్వరపురం గ్రామానికి చెందిన ఉన్నమాటి నాగదుర్గతో 2022లో వివాహం జరిగింది. కొంత కాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మే నెల నుంచి తాళ్లపూడి మైగాపులవారి వీధిలో వీరాస్వామి అద్దెకు ఉంటున్నాడు. అక్కడ ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఏమైందో ఏమో శనివారం అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి ఆచంట సుందరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

కంబాలచెరువు: మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పిల్లి సత్యరమేష్ శనివారం తెలిపారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు, వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం రాజమహేంద్రవరంలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణతో పాటు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రాక్టీసు టెస్ట్, గ్రాండ్ టెస్టు కూడా నిర్వహిస్తామని, లైబ్రరీ సౌకర్యం కూడా ఉందన్నారు. రెండు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ రూ.1,000లు, నెలకు స్టయిఫండ్ నెలకు రూ.1,500, బుక్స్ అలవెన్స్ సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎస్జీటీ టెట్ క్వాలిఫైడ్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సెల్ఫ్ అడ్రస్ కవర్, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జత చేసి ఈనెల 30వ తేదీలోగా డైరెక్టర్, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, నియర్ ఆర్ట్స్ కాలేజ్, రాజమహేంద్రవరం–533133, చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. వివరాలకు 0883– 2421129, 93939 34825, 86394 47339 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నృత్యాభినయం.. నయనానందం


నృత్యాభినయంతో అలరిస్తున్న కళాకారులు

- 130 మంది కళాకారుల మధ్య పోటీ
- అలరించిన కళాసమ్మేళన్



సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): పురివిప్పిన నెమళ్లలా.. అందమైన నాట్యంతో కళాకారులు అలరించారు. తమలోని ప్రతిభను ప్రదర్శిస్తూ చేసిన నృత్యాభినయం నయనానందకరంగా సాగింది. పోటాపోటీగా 130 మంది కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ద్వారా మూడో రోజు అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు కొనసాగాయి. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నగరపాలక సంస్థ, గెయిల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళా సమ్మేళన్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వివిధ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. దీనికి బెంగళూర్, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మలేషియా, యూఎస్ నుంచి కళాకారులు హాజరయ్యారు.


ఆకట్టుకున్న లక్ష్మీదీపిక బృందం ప్రదర్శన

పాదం కలిపి.. నాట్యం చేసి..

భరతకళ శిఖామణి, ఆడల్ అరసు గురుశ్రీ డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి ఆధ్వర్యంలో మలేషియా నుంచి వచ్చిన కళాకారులు తమ నాట్య ప్రతిభతో గోదావరి తీరానికి కళ తెచ్చారు. భరతనాట్య ప్రదర్శనలో భాగంగా గురుశ్రీతో పాటు ఆయన శిష్యులు పాదం కలిపి సమ్మోహనంగా నాట్యం చేశారు. అదే విధంగా రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీబీ నారాయణ రచించిన నాట్యామృత సంభవం అనే రుచి రూపకాన్ని రాధాకృష్ణ కళాక్షేత్ర కళాకారులు ప్రదర్శించారు. మలేషియా నుంచి వచ్చిన గురుశ్రీ ఆర్.చంద్రమోహన్, పీఎంపీ అసోసియేషన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జి.జయశ్రీ, జి.లక్ష్మీదీపిక తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఎన్నడో..!

నోటిఫికేషన్‌కు విద్యార్థుల ఎదురుచూపులు



రామచంద్రపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయవరం: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఎప్పుడు విడుదలవుతుందా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో జూన్ 20 నాటికే నోటిఫికేషన్ విడుదల కాగా, ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా విడుదల కాని పరిస్థితి నెలకొంది. గతేడాది ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించారు. ప్రస్తుతం ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలయ్యాయి. అనంతరం ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి ఈ నెల 18న ఫలితాలను కూడా విడుదల చేశారు. ఇప్పటికే ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు తదనంతరం ఉన్నత చదువులకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా డిగ్రీ చదవాలనుకునే వారు ప్రవేశాల ఆన్‌లైన్ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని చూస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరుల్లో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,800 వరకూ సీట్ల భర్తీకి అవకాశముంది. అలాగే 45 ప్రైవేట్, ఒక అటానమస్ డిగ్రీ కళాశాల ఉంది.

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు

జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి గత విద్యా సంవత్సరం నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టింది. సంప్రదాయ మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అమలు చేస్తున్నారు. ఈ కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టును మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా చదువుకుంటాడు. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు. డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు అని సర్టిఫికెట్ ఇస్తారు. రెండేళ్లు అయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు అయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్ సర్టిఫికెట్‌ను విద్యార్థికి అందజేస్తారు. విద్యార్థి డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసే వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు అందజేస్తారు. విద్యార్థి ఫస్టియర్ నుంచి నాలుగేళ్ల లోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది విద్యాభ్యాసం కొనసాగించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ స్కూల్ ఆఫ్ నర్సింగ్ : GNM 3 Yrs. గవర్నమెంట్ & మేనేజ్‌మెంట్ సీట్స్ కలవు. అర్హత : ఇంటర్ (సైన్స్ & ఆర్ట్స్ గ్రూప్స్ వాళ్ళకు అవకాశం కలదు). సంప్రదించండి : 92466 75657 [V- 823808]

Real Estate

FLAT FOR SALE

■ RJY, V.L.Puram 3BHK Deluxe E/F Flats for sale 1510 Sft. ready to occupy lift & car parking available contact. ✆ : 99088 71143 [R-6811]

HOUSE FOR SALE

■ కాకినాడ డి.మార్ట్ దగ్గర 500 గజాలు, తూరంగిలో 150 గజాలు W/F బిల్డింగ్, రామేశ్వరం కొత్తూరులో E/F న్యూ బిల్డింగ్ కత్తిపూడి హైవేకి చేర్చి 8 ఎకరాలు అమ్మకము. ✆ : 95500 58067 [R-119]

■ House for Sale సర్పవరంలో చైతన్య రాజు విల్లాస్ ఎదురుగా G+1 ఈస్ట్ ఫేసింగ్, 210 స్క్వేర్ యార్డ్స్ గల హౌస్ అమ్మకము నకు కలదు. సెల్: 92900 28461, 81423 32667 [R-2169]

■ RJY, కొంతమూరు, ప్రకాశం నగర్ ఎంప్లాయిస్ కాలనీ 4th బ్రిడ్జి రోడ్ దగ్గర N//F, N/W. కార్నర్ 150 చ॥గ॥లో 2 BHK హౌస్ కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ : 98482 29450, 90004 30222. [R-6815]

PLOT FOR SALE

■ రాజమహేంద్రవరం రాజవోలు FCI గొడౌన్స్ సమీపంలో 400 స్క్వేర్ యార్డ్స్, DTCPO అప్రూవల్ గల ప్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ : 86392 77932 [R-2182]

■ Amalapuram - Commercial Plot 44 Cents for Sale in Prime Location. Suitable for Hospitals, Apartments. Out Rate Only. Cell: 733 722 6777 [C-800297]

■ కాకినాడ జిల్లా పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లో పద్మనాభం కాలనీ, పాత RTC బస్‌స్టాండ్ దగ్గర DTCP అప్రూవల్ లే అవుట్‌లో ప్లాట్ నెం. 1, 2, 3 అమ్మబడును. ✆ : 89775 77487 [R-1229014]

PROPERTY LEASE

■ కాకినాడకు దగ్గరలో పటవల గ్రామంలో 20 ఎకరాల చేపల చెరువు లీజుకు కలదు. వివరాలకు ఫోన్ నెం: 9652900003 [HA-02111]

RENT

■ రాజమహేంద్రవరం కొంతమూరులో 1000 చ॥గ॥ ప్రాంగణంలో చక్కటి కనస్ట్రక్షన్ శ్రీ అంబికా ఫ్యామిలీ రెస్టారెంట్ ఫర్నిచర్ వంట సామగ్రితో పాటు అద్దెకు ఇవ్వబడును. ✆ : 91777 71569, 99480 37946 [R-2183]

TO-LET

■ 2 Bedroom Flat North Facing for lease / rent office/ house (no monthly rent) in Prakashnagar with car parking ✆ : 73967 12052, 90639 30599 [R-1171436]

■ కాకినాడ పెద్దమార్కెట్‌లో మంచి రన్నింగ్‌లో గల కిరాణా షాపు అద్దెకు ఇవ్వబడును. క్యాటరింగ్ సామాన్లు సెకండ్ హ్యాండ్ వస్తువులు కావలెను. ✆ : 99121 30247 [R-118]

Services

OLDAGE HOME

■ ఆదరణ హోమ్‌కేర్ సర్వీసెస్, చిన్నపిల్లలను, వృద్ధులను, పేషెంట్లను మీ ఇంటివద్ద / ఆసుపత్రిలో సర్వీస్ చేయుటకు నర్సులు, ఆయాలు, అటెండర్స్‌ను మీ వద్దకు పంపబడును. ✆ : 91105 18713, 85008 77618 [R-1606]

GROUNTING WORKS

■ గ్రౌంటింగ్ వర్క్స్ : శ్లాబులు, వాటర్ ట్యాంకులు, బాత్‌రూమ్ లీకేజీలు, గోడ చెమాయింపులు, గోడ పగుళ్ళు మొదలగునవి కెమికల్స్‌తో 100% గ్యారంటీతో గ్రౌంటింగ్ చేయబడును. M.S. గ్రౌంటింగ్ వర్క్స్, డైరీ ఫారం సెంటర్, కాకినాడ సెల్: 88748 47738 [R-2168]

Wanted

■ ★ RJY లో R.E ఆఫీస్‌కు బాదరబందీ లేని 45 సం॥ల హిందూ స్త్రీకి వసతి+జీతం + 2 వీలర్ & భవిష్యత్తుకు భరోసా ★ మార్కెటింగ్ మిత్రులకు ఆహ్వానం! ✆ : 93900 60136 [R-511]

■ ఉచిత వర్కర్లు ఉద్యోగం కావలసినవారు ఉద్యోగులు కావలసినవారు, పనిమనిషి కావలసినవారు, పనిమనిషికి వారు సేవ చేసేవారు సహాయం కావలసినవారు సంప్రదించండి. బిందు శ్రావణి దేవి చారిటబుల్ ట్రస్ట్ ✆ : 96633 63813 [R-531]

■ ప్రముఖ విద్యాసంస్థ కాకినాడ, శాంతినగర్ నందు Nursery to 2nd క్లాస్‌కి మదర్ టీచర్స్ & IIIrd to Xth క్లాస్ ఆల్ సబ్జెక్ట్స్ టీచర్స్ కావలెను. ✆ : 95814 21222, 95026 35557 [R-117]

■ కష్టమైన్లీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000- 40000, ఫ్రీరూం+భోజనం.HYD. 6309020999 [HA-273]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ:18K. ఫోన్: 9640258899/9640468899 [H-799894]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185222]

■ Wanted Male Marketing Vice Principals Qualification Any Degree. Age Limit: 25 to 45years. Salary Upto: 20,000/- Location: Rajahmundry. Contact: 9248733370 [G-5456]

■ లేడీటీచర్లు కావలెను. వసతి ఫ్రీ, అర్హత : D.Ed., B.Ed., డిగ్రీ. జీతం : రూ.7వేలు నుండి 9 వేలు. HM (F) రూ.15 నుండి 20 వేలు (అనుభవం ఉన్నవారు మాత్రమే). మీ Resume ను సెల్ : 98498 54673 కు వాట్సాప్ / మెసేజ్ పంపండి. విశ్వశాంతి E.M. స్కూల్ (ప్రైమరీ), మల్లాం, పిఠాపురం (మం), కాకినాడ జిల్లా. [R-2170]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ.: 400/-

అదనపు లైనుకు రూ.: 90/-

GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205

కాకినాడ - 90101 11140, 90109 67896, పిఠాపురం - 99516 02838, తుని - 90109 67896, జగ్గంపేట - 99482 85589 యానాం - 90101 11140,

అమలాపురం-9705347414, 9705346456, 9848648081, 9010299082,

మండపేట: సెల్: 99516 02941, 08855-233559,

రామచంద్రపురం : సెల్: 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010